క్లుప్తంగా

వీఆర్ఏల ఆందోళన



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

కలువాయి(సైదాపురం): తమకు జీతాలు పెంచాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలువాయి తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు ఆందోళన చేశారు. వీఆర్ఏల సంఘం అధ్యక్షులు చెంచయ్య మాట్లాడుతూ సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. అనంతరం తమ డిమాండ్లపై తహసీల్దార్ శ్యాం సుందర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పట్టాల పంపిణీ వాయిదా

తడ: మత్స్యకారులకు పట్టాలు పంపిణీ చేసేందుకు పూడి కుప్పంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమం వర్షం వల్ల వాయిదా పడింది. గత ప్రభుత్వ హయాంలో పూడి గ్రామంలోని 200 మత్స్యకార కుటుంబాలకు సరిపడా లేఔట్ తయారు చేశారు. ఆ సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ఆగింది. ఆ పట్టాల పంపిణీ నేడు వర్షం కాలంగా వాయిదా పడింది.

కండలేరులో 27 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 27.632 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2100, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 100, హైలెవల్ కాలువకు 10, మొదటిబ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య సిబ్బందికి సత్కారం



సన్మానిస్తున్న వైద్యాధికారులు

కలువాయి (సైదాపురం) : మండల కేంద్రానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న సిబ్బందికి సూపర్‌వైజర్లు రఘురామయ్య, ఎస్ సూర్య కుమారి, ఏఎన్ఎంలు ప్రమీల, బి బుజ్జమ్మ, ఎస్ సుప్రజ, ఐ ప్రసన్న, కలువాయిలోనే 19 ఏళ్లుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఆశా కార్యకర్త లలితమ్మకు పీహెచ్‌సీ సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటు చేసి, ఘనంగా సన్మానించారు.

ఆదిలక్ష్మీదేవికి ఆస్థానసేవ



ఆదిలక్ష్మీదేవి ప్రాకారోత్సవంలో అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఆదిలక్ష్మీ దేవికి శుక్రవారం ఆస్థానసేవ, ప్రాకారోత్సవం, కుంకుమార్చన పూజ నిర్వహించారు. శ్రావణమాసంలో మొదటి శుక్రవారం కావడంతో ఆదిలక్ష్మీదేవికి ఆస్థాన సేవ, ప్రాకారోత్సవాన్ని(ప్రదక్షిణలు)నిర్వహించారు.

తాళ్లమ్మ దేవత కొలుపు

దక్కిలి : మండలంలోని దగ్గవోలు గ్రామ దేవతగా కొలువైన తాళ్లమ్మకు కొలుపు మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా ఆరంభించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ కొలుపులో తొలి రోజు అమ్మవారి చిత్రాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు.

నాయుడుపేటటౌన్ : శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి పట్టు చీరలతో అలంకారం చేశారు.

చికెన్ ధరలు		26.7.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	134
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	264
లేయర్ చికెన్	:	190

బదిలీలు..ఆత్మీయ వీడ్కోలు



సైదాపురం: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు



కోట: సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న గ్రామస్తులు

సైదాపురం : మండలంలోని ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీఎస్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన వెంకటరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అశ్విని కుమార్, సులోచన, పుష్పకళను శాలువ, పుష్పాలతో ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళ్లిన గణిత ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు రూ.3 వేలు పాఠశాలకు బహూకరించారు.

ప్రోత్సాహక బహుమతులు

పాఠశాలలో గత ఏడాది పది ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పి.వెన్నెలకు రూ.5వేలు, నవదీప్‌కు రూ.1116, లావణ్యకు రూ.516 చొప్పున ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతోపాటు సర్పంచ్ పెంచలయ్య, న్యాయవాది నారాయణరావు, ఉప సర్పంచ్ గౌతమ్‌శ్రావణ్, సెక్రటరీ రాఘవేంద్ర పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం

కోట: కేసవరం సచివాయంలో పనిచేసి బదిలీపై వెళుతున్న సిబ్బందిని కేసవరం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు చేసిన సేవలకు గుర్తుగా సన్మానించారు. లోహిత్‌కుమార్, సురేష్, మోహిసిన్, శ్రీనివాస్, సుకన్య, అనిల్, మహేష్, షర్మిల వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారు అందించిన సేవలను గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాం క్రిష్ణ స్వాతి, నాయకులు గురుస్వామి, ఉలవకాయల ప్రసాద్, సుబ్బయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారుమూరికి శుభాకాంక్షల వెల్లువ



కారుమూరి వెంకట నాగేశ్వరరావు శుభాకాంక్షలు చెబుతున్న నేదురుమల్లి



పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి

సైదాపురం/పెళ్లకూరు/నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ సీపీ నెల్లూరు జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్‌గా నియమితులై, తొలిసారిగా నెల్లూరుకు విచ్చేసిన కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు పలువురు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో వెంకటగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పార్టీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు భావన్ అనుదీప్, వివేక్ శుక్రవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ గోపి

బాలాయపల్లి(సైదాపురం) : విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బాలాయపల్లి ఎస్ఐ గోపి తెలియజేశారు. మండలంలోని వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తుకు బానిస కావద్దని తెలియజేశారు. ర్యాగింగులకు పాల్పడకుండా విద్యపై దృష్టి సారించాలని తెలియజేశారు. అసాంఘిక కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిరచనున్నట్లు తెలిస్తే వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ కరుణకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకుల పాఠశాలలో..

కోట: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కోట కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి మీనాక్షిసుందరి తెలియజేశారు. స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మోహన్, బాబురెడ్డి, రమణ, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధ్వంసమైన గాంధీ విగ్రహం పరిశీలన



పంచాయతీ అధికారులు చెత్త కుప్పలో నుంచి తెచ్చి భద్రపరిచిన గాంధీజీ విగ్రహం

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని పుదూరు గ్రామంలో గాంధీజీ విగ్రహాన్ని స్థానిక టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన విషయమై శుక్రవారం అధికారులు పరిశీలన చేశారు. గ్రామ శ్మాశనవాటిక సమీపంలో చెత్త కుప్పలో పడేసి ఉన్న గాంధీజీ విగ్రహాన్ని తీసుకొచ్చి గ్రామ పంచాయతీ కార్యాలయంలో భద్రపరచినట్లు కార్యదర్శి వెంకట్రావ్ తెలిపారు. గ్రామంలో సుమారు 60 ఏళ్లుగా ఉన్న గాంధీజీ విగ్రహాన్ని జేసీబీతో ధ్వంసం చేసిన తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు శుక్రవారం రాత్రి గ్రామంలో గాంధీజీ విగ్రహానికి తీరని అవమానం జరిగిందని ధ్వంసం చేసిన గ్రామానికి చెందిన అల్లెకుల మనోజ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని పోలీసులతో పాటు ఎంపీడీఓ సురేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ బాబి పుదూరు పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మనోజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాంధీజీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం పలు ప్రజా సంఘాల నాయకులు ఎండీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



ప్రమాదానికి గురైన కారు

నాయుడుపేటటౌన్: కారు విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొనడంతో నలుగురికి గాయాలైన సంఘటన పట్టణంలో శుక్రవాం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, విశాఖపట్నం ప్రాంతానికి చెందిన శ్రీనాథ్, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కారులో తిరుపతి నుంచి విశాఖకు బయలుదేరారు. మార్గం మధ్యలో నాయుడుపేట సమీపంలో రింగ్ రోడ్డు వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. దీంతో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది వీరిని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్సలు అందించారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా : నలుగురికి గాయాలు



కాలువలో పడిన కారు

పెళ్లకూరు: కారు బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు అమలాపురం నుంచి తిరుపతికి కారులో నలుగురు బయల్దేరారు. మార్గమధ్యలో కొత్తూరు గిరిజన కాలనీ సమీపాన పంట కాలువలో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఉదయ్‌కిరణ్, ధనుశేఖర్, లవసతీష్, శివసాయికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108లో శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు సైదాపురంలో మహా ధర్నా

సైదాపురం: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కల్లూరు పెంచలయ్య స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొలకలపూండ్ల రెవెన్యూ పరిధిలోని కమ్మవారిపల్లెకు చెందిన ఎస్సీ, ఎస్టీలు సాగులో ఉన్న భూములను లాక్కుంటున్న అధికారుల తీరుకు నిరసిస్తూ ఈ మహా ధర్నా చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.

బస్సు దిగితే బురద తొక్కాల్సిందే!



సైదాపురం: మండల కేంద్రంలో బస్సు దిగితే బురద తొక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం కురిసిన వర్షాలకు బస్టాండ్‌లో ఉన్న లోతట్టు ప్రాంతంలో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. దీంతో అక్కడ బురదమయంగా మారింది. బస్సు నుంచి ప్రయాణికులు బురదలోనే దిగాల్సి వస్తోంది.

చిన్నారిని చితకబాదిన టీచర్



గాయపడిన చిన్నారి

కలువాయి(సైదాపురం): యూకేజీ చదువుతున్న చిన్నారిని ప్రైవేటు టీచర్ చితకబాదడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన కలువాయిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు కలువాయిలోని ఓ ప్రైవేటు స్కూల్లో యూకేజీ చదువుతున్న వీర సంతోవిష్ణను స్కూల్ టీచర్ శ్రావణి చితకబాదారు. ఆ విద్యార్థికి స్నానం చేయిస్తుండగా ఒంటిపై దెబ్బలు చూసి ఆ తల్లి నిశ్చేష్టురాలయ్యారు. ఏం జరిగిందని ప్రశ్నించగా, టీచర్ శ్రావణి కొట్టారని విద్యార్థి బోరున విలపించాడు. దీంతో చిన్నారి కుటుంబ సభ్యులందరూ కలువాయి పోలీసుస్టేషన్‌కు చేరుకుని తమ బిడ్డకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట: చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. ఉదయం సిబ్బంది విధులకు హాజరవగా చెట్టుకు వేలాడుతున్న శవం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ బ్రహ్మనాయుడు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆరాతీయగా మృతుడు వట్రపాళెంకు చెందిన కె.శివకుమార్(52)గా గుర్తించారు. వారి బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పక్కనే ఉన్న ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

గూడూరురూరల్ : పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎస్.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.శివప్రసాద్ తెలిపారు. ఎన్.ఎస్.ఎస్. విద్యార్థుల సహకారంతో ప్రాజెక్ట్ అరణ్యలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కోట: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆరు వారాలుగా ఇస్తున్న డిజైన్ నైపుణ్య శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. దీనికి బెంగళూరుకు చెందిన డైనమిక్ ఇంజినీరింగ్ సర్వీస్ చైర్మన్ నాగార్జున హాజరయ్యారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను తెలియజేశారు. డిజైన్ స్కిల్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులందజేశారు. కళాశాల డైరక్టర్ విజయకుమార్‌రెడ్డి, హెచ్‌ఓడీ విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వెంకటగిరి రూరల్: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఏడుకొండలు కథనం మేరకు, కుమ్మరిగుంటకు చెందిన హనుమంతు (35) సెప్టిక్ ట్యాంకు వాహనంలో పనిచేసుకుంటూ జీవిస్తుండేవారు. ఈయనకు భార్య లక్ష్మితో పాటు ఇద్దరు పిల్లలున్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో మూడేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. అయితే ఇటీవల మళ్లీ ఇద్దరు కలిసిపోయి జీవనం సాగిస్తున్నారు. నెల రోజుల నుంచి మద్యం తాగి వస్తుండడంతో లక్ష్మి మందలిస్తూ వస్తోంది. ఈ క్రమంలో పురుగుల మందు తాగి హనుమంతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా రహదారి



గుంతలో ఇరుక్కున్న లారీ

కలువాయి(సైదాపురం): చినుకు పడితే కలువాయి–సోమశిల ప్రధాన రహదారి పరమదారుణంగా మారింది. వాహనచోదకులు ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. ఏక్షణం ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆ మార్గంలోనే వెంకటరెడ్డిపల్లి జంక్షన్ వద్ద పెద్ద గుంత ఉండటంతో తరచు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. తాజాగా లారీ ఇరుక్కుపోయింది. రోడ్డుకు ఇరువైపులా బురదమయంగా ఉండడంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

నిమ్మ పంటపై రైతులకు అవగాహన



రైతులకు అందజేస్తున్న పురుగు మందులు



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న అధికారులు

సైదాపురం: నిమ్మలో అధిక దిగుబడులను సాధించడంపై తిరుపతి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రాంతీయ పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ రూత్, డాక్టర్ తనూజ, డాక్టర్ కవిత, డాక్టర్ రంజిత్, డాక్టర్ భానుమూర్తి అవగాహన కల్పించారు. మండలంలోని మర్లపూడిలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రాంతీయ పరిశోధన కేంద్రం వారి సౌజన్యంలో నిమ్మ రైతులకు పరికరాలను, పురుగుమందులు అందజేశారు.

రాపూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి సోమసుందర్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని గండూరుపల్లి, తూమాయి, వేపినాపి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రాపూరు, పొదలకూరు, చేజర్ల, మనుబోలు, కలువాయి మండలాల వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.